నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

పండితులకు గాక పామరులకు గూడ
అర్థమవగ నేను సార్థకముగ
పద్యరచనలోన వాడుకభాషను
వాడుచుంటినయ్య వాంఛితముగ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 362 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 29-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్


- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- మొత్తం 142 స్థానాలకు ఎన్నికలు
- రంగంలో 1448 మంది అభ్యర్థులు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న మూడు కోట్ల మంది ప్రజలు

2



## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడి
- ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తి
- సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు.
- విద్యార్థులు తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం



2



తెలంగాణలో పెరిగిన

## ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

హైదరాబాద్,

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా -మిగతా 2 లో

తెలంగాణ కొత్త డీజీపీగా

## సీవీ ఆనంద్ నియామకం



2

ఫ్యూచర్ కోసమే...

# సిటీ నిర్మాణం

ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక


- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన



హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. -మిగతా 2 లో






పెట్రోల్, డీజిల్ ధరలు

## భారీగా పెంపు

- దేశవ్యాప్తంగా కొరతపై పుకార్లు
- పుకార్లను ఖండించిన కేంద్రం
- అలాంటి ఆలోచన లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,

నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరార్లులను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమబెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. -మిగతా 2 లో





## ఇరాన్ పతనమైంది..

- హోర్ముజ్ తెరిచేందుకు సిద్ధంగా ఉంది..
- డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

న్యూఢిల్లీ,

హోర్ముజ్ జలసంధి అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పతనమైందని, హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉందని ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తమకు ఇరాన్ తెలిపినట్లు ట్రంప్ అన్నారు. పతనం అంచున ఉన్నందున తాము హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరుస్తామని ఇరాన్ కోరిందని ట్రంప్ వెల్లడించారు.అయితే, ఈ అంశంపై ఇరాన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ, హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ ఇటీవల అమెరికాకు షరతు విధించిన సంగతి తెలిసిందే. హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధనం నుంచి తొలగిస్తేనే తాము ఈ జలసంధిని తెరుస్తామని ప్రకటించింది. ఈ జలసంధిపై ఇరాన్ దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ చిన్న జలసంధి ప్రపంచ సముద్ర రవాణా మార్గానికి కీలకం. ముఖ్యంగా -మిగతా 2 లో



అమరావతి - హైదరాబాద్

## మధ్య బుల్లెట్ ట్రైన్

- 70 నిముషాల్లోనే ప్రయాణం
- చంద్రబాబు విజనరీ లీడర్
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

2

## అవినీతిపై పోరాటం కొనసాగిస్తాం



2

ప్రధాని మోదీ..

# గోల్డెన్ గోల్

ఫుట్‌బాల్ ఆడుతూ యువతలో ఉత్సాహం

- సిక్కిం పర్యటనలో క్రీడాకారులతో కలిసి ఆట
- మైదానంలో ఉత్సాహంగా కనిపించిన ప్రధాని
- సోషల్ మీడియాలో వీడియో, ఫోటోలు
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కామెంట్స్

ఈశాన్య రాష్ట్రం సిక్కిం.. ప్రకృతి అందాలకే కాదు, క్రీడా స్ఫూర్తికి కూడా పెట్టింది పేరు. ఆ స్ఫూర్తిని మరింత రగిలిస్తూ ప్రధాని మోదీ తన సిక్కిం పర్యటనలో ఫుట్‌బాల్ ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవ ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని, అక్కడ స్థానిక క్రీడాకారులతో కలిసి మైదానంలో ఉత్సాహంగా గడిపారు. ప్రస్తుతం ఈ ఫోటోలు, వీడియోలు దేశవ్యాప్తంగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ఏడు పదుల వయసులోనూ ప్రధాని మోదీ మైదానంలో చూపిన చురుకుదనం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని క్రీడాభిమానులు ప్రశంసిస్తున్నారని ఏఎన్ఐ వార్తా సంస్థ రిపోర్ట్ చేసింది. తన అధికారిక 'శ' ఖాతాలో మోదీ స్వయంగా ఈ ఫోటోలను, ఒక ఆసక్తికరమైన వీడియోను పంచుకున్నారు. దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు, 'ఫిట్ ఇండియా' లక్ష్యాన్ని సాధించేందుకు ఆయన స్వయంగా గ్రౌండ్‌లో ఆడిన తీరు ఒక చక్కని ఉదాహరణగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



2

- న్యూఢిల్లీ,





ఇలాగైతే విమానాలను

## నడపలేం

- విమాన ఇంధన ధరలను అదుపు చేయండి
- వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ


న్యూఢిల్లీ,

విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. -మిగతా 2 లో

## ప్రశ్నిస్తే.. జైలుకేనా?

కాంగ్రెస్ ది అరాచక పాలన

- ఇదేం ప్రజాపాలన అంటూ సర్కార్‌పై హరీష్ రావు ఫైర్
- నేనే రాజు.. నేనే మంత్రి అంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిక
- ఎన్ని కేసులు పెట్టినా గులాబీ సైనికులు ప్రశ్నిస్తూనే ఉంటారని స్పష్టీకరణ
- ఫేక్ పోస్టులు పెట్టిన వారిపై కేసులు ఎందుకు పెట్టలే?
- క్రిశాంక్‌పై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్
- రేవంత్ రెడ్డి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని వ్యాఖ్య



సంగారెడ్డి

కాంగ్రెస్ ది అరాచక పాలన అని మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడమేనా ప్రజాపాలన అని నిలదీశారు. నేనే రాజు.. నేనే మంత్రి అంటూ వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావుతో కలిసి హరీష్ రావు పరామర్శించారు. -మిగతా 2 లో

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

-మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడి
-ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తి
-సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు.
-విద్యార్థులు తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం





**హైదరాబాద్,**

తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- మొత్తం 142 స్థానాలకు ఎన్నికలు
- రంగంలో 1448 మంది అభ్యర్థులు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న మూడు కోట్ల మంది ప్రజలు



**కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయ్యింది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది.

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

మొదటి తరువాయి

హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలువు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్లు డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు

మొదటి తరువాయి

పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ.2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

# ఫ్యూచర్ కోసమే...సిటీ నిర్మాణం

మొదటి తరువాయి

అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి



అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినీతిపై పోరాటం కొనసాగిస్తాం

**రాజ్‌ఘాట్ వద్ద ఆప్ నేతల ప్రతిజ్ఞ**



**న్యూఢిల్లీ**

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మంగళవారం రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మా గాంధీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ మాజీ సీఎం అతిశీ మర్లెనా, ఆప్ ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మహాత్ముడి అడుగుజాడల్లో నడుస్తూ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ప్రశ్నిస్తే.. జైలుకేనా?

మొదటి తరువాయి



ఆయనతో పాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను కూడా కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హరీష్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫేక్ పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా, ఆధారాలతో ఫిర్యాదు చేసిన క్రిశాంక్‌ను అరెస్ట్ చేయడం కక్షసాధింపే అని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు, సీట్లు, కమిషన్లతో అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్రిశాంక్‌పై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడంపై మెజిస్ట్రేట్ కూడా పోలీసులను ప్రశ్నించారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఫోన్ల కుంభకోణం, టెస్ట్ పేపర్ లీక్, హెచ్‌సీయూ గచ్చిబౌలి భూములు, సోమ్ డిస్టిలరీస్ వ్యవహారం, మిస్ వరల్డ్ పోటీల వివాదం వంటి అంశాలను ప్రస్తావించినందుకే క్రిశాంక్‌పై వరుసగా కేసులు పెట్టారని హరీష్ రావు ఆరోపించారు. భారత పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదా అని ప్రశ్నించారు.

## ఇలాగైతే విమానాలను నడపలేం

మొదటి తరువాయి



ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది. ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, అలాగే, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలనిల కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యుయల్ ధరలు పెరిగితే, అంతిమంగా విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.

## ఇరాన్ పతనమైంది..

మొదటి తరువాయి

చమురు సరఫరాకు కీలకంగా మారింది. పాశ్చాత్య దేశాలు ఇరాన్ చమురుపై ఆంక్షలు విధించడంతో ఆయా దేశాల సరుకుల రవాణాపై ఇరాన్ నిషేధం విధిస్తూ, హోర్ముజ్‌ను చెక్ పాయింట్గా వాడుకుంటోంది. అయితే, ఈ ప్రాంతాన్ని, ప్రపంచ వ్యాపారాన్ని అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదనేది ఇరాన్ మాట. కానీ, హోర్ముజ్‌ను తమ అధీనంలో ఉంచుకోవడం హక్కని చెబుతోంది. మరోవైపు ఇరాన్‌కు నాయకత్వ లేమి సమస్య ఉందని ట్రంప్ భావిస్తున్నారు. చర్చల్లో ఈ అంశం ప్రతికూలంగా మారిందన్నారు. మరోవైపు ఇరాన్ యుద్ధానికి ముగింపు పలికే అంశంలో ఇరాన్ ప్రతిపాదనల్ని ట్రంప్ తోసిపుచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్?తో చర్చల అంశంలో ఇంకా ఎలాంటి ముందడుగు పడటం లేదు.

## తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం



**హైదరాబాద్ :**

రాష్ట్ర కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆనంద్‌ను డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఈ నెలాఖరతో శివధర్ రెడ్డి పదవీకాలం ముగయనున్నది. ఆయన స్థానంలో ఆనంద్ బాధ్యతలు చేపట్టనున్నారు.రాష్ట్రం నుంచి ఐదుగురి పేర్లు యూపీఎస్సీకి పంపగా వారిలో అర్హులైన ముగ్గురి పేర్లను యూపీఎస్సీ రాష్ట్రానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. యూపీఎస్సీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి సీవీ ఆనంద్, వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా పేర్లు వచ్చాయి. ఈ నెల 31న ప్రస్తుత డీజీపీగా ఉన్న బీ శివధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేస్తుండగా.. ఆయన స్థానంలో పూర్తిస్థాయి డీజీపీగా సీవీ ఆనంద్ పేరు ప్రకటించారు.

## ప్రధాని మోదీ.. గోల్డెన్ గోల్



**న్యూఢిల్లీ,**

నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

# రాష్ట్ర విద్యాసదస్సును విజయవంతం చేయండి : టీపీటీఎఫ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వాలు మారినా విద్యారంగ విధ్వంసం మాత్రం కొనసాగుతూనే ఉందని, ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి అన్నారు. విద్యా కమిషన్ సిఫార్సులు, ముఖ్యమంత్రి ఆలోచనలు, బహుళ విధానాలు స్పష్టత లేకుండా ఉండటంతో విద్యావిధానం సంక్షోభంలో ఉందని వారు పేర్కొన్నారు. ఒకవైపు టీచర్లు, అధికారులు విదేశాల్లో అధ్యయనం చేస్తుండగా, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యం పాలవుతున్నాయని విమర్శించారు. స్వీడన్ మాదిరిగా విద్యను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, చైనా మాదిరిగా ప్రైవేటు పాఠశాలలను రద్దు చేసి కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర విద్యాసదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సుకు విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలాస్, ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరాం, విద్యా ఉద్యమకారుడు ప్రొఫెసర్ హరగోపాల్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, పూర్వ సంపాదకుడు కె. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.

# లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**మహేశ్వరం, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామంలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వినోద్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితా ఇంద్రరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎమ్మార్వో, స్థానిక సర్పంచ్ మునగపాటి నవీన్, మాజీ పీఎస్‌సీఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, నాగారం సర్పంచ్ బండారి లింగం తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ, "అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం ద్వారా ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతోంది" అని తెలిపారు.

# నిరుద్యోగ యువతను అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం





**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు నింపుతూ, ప్రతిభకు దిశానిర్దేశం చేస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాల్గవ ఉచిత ఎస్ఐ ఉ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం కల్వకుర్తి పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ, "నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం. గ్రామాల్లో ప్రతిభ ఉంది కానీ అవకాశాలు కొరత. ఆ లోటును భర్తీ చేయడానికే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగం ఒక నియామకం మాత్రమే కాదు, అది కుటుంబ గౌరవం, సమాజంలో గుర్తింపు, సేవా బాధ్యత" అని పేర్కొన్నారు. అతిథులు మాట్లాడుతూ, "గ్రామీణ యువతకు అందుబాటులో అవకాశాల వేదికలను సృష్టిస్తున్న సుంకిరెడ్డి కృషి అభినందనీయం. ఫీజులు కట్టలేక కలలు వదులుకునే పేద విద్యార్థులకు ఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రాలు ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయి" అని కొనియాడారు. శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు మాట్లాడుతూ, "మా పరిస్థితుల్లో కోచింగ్ ఖర్చుతో కూడుకున్నది. ఇలాంటి పరిస్థితుల్లో సుంకిరెడ్డి సహకారంతో గొప్ప అవకాశం లభించింది. ఉద్యోగం సాధించి ఈ నమ్మకాన్ని నిలబెడతాం" అని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసున్న, జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, సీనియర్ పాత్రికేయులు ప్రహ్లాద్, పరిపూర్ణం, శ్రుతిలయ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండల దృశ్యలో ఉపాధి హామీ కూలీలకు శీతల పానీయాలు పంపిణీ



**మర్రిగూడ, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షుడు లపంగి నరసింహ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు కూల్‌డ్రింక్స్ అందించారు. కూలీల వద్దకు వెళ్లి శ్రద్ధతో పానీయాలు అందించడం ద్వారా నాయకత్వం అంటే ఏమిటో చూపించారు. "పెద్ద పనులు చేయకపోయినా, చిన్న శ్రద్ధ కూడా అలసటను తగ్గించి ఆశను పెంచుతుంది. మన చుట్టూ ఉన్నవారిని గమనించి, అవసరమైనప్పుడు చేయి అందించడం---అదే నిజమైన మానవత్వం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# పెట్రోలు బంక్ లో నో స్టాక్ బోర్డులు పెట్టొద్దు

-కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎండగట్టండి.
-కొండేటి శ్రీను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.



**నిడమనూరు ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతతో పెట్రోల్ బంక్ ల ముందు నో స్టాక్ బోర్డులు కనబడుతున్నాయి, దీంతో ప్రజలు రైతులు,వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను విలేకరులతో మాట్లాడుతూ కేవలం లాభా పేక్షతోనే ఈ ఆయిల్ కంపెనీలు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థలు కలిపి సామాన్యుడిని దోచుకునేందుకు పన్నిన కుట్రలో భాగమే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి. సమురు సంస్థల ద్వారా అన్ని బంక్ లకు ఆయిల్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు, ఒకవైపు దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతూనే. మరోవైపు కృత్రిమ కొరతను సృష్టించడం కేంద్ర బిజెపి ప్రభుత్వ దుర్చర్యకు నిదర్శనం, ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో ఆయిల్ సంక్షోభాన్ని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచకుండా నిలిపివేసి, ఎన్నికలు ముగిసిన వెంటనే సామాన్యుడిపై ధరల భారం మోపే ఎందుకు రంగం సిద్ధం చేసింది, రష్యా నుంచి అతి తక్కువ ధరకు ముడి చమురు దిగుమతి చేసుకున్నా. ఆ లాభాన్ని ప్రజలకు పంచకుండా కేవలం కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందని, పెట్రోల్ బంక్ డీలర్లు ముందస్తుగా వందల కోట్ల రూపాయల డిపాజిట్లు చెల్లించినప్పటికీ చమురు సంస్థలు ఆయిల్ ట్యాంకర్లను పంపడం లేదు, డీజిల్ దొరకక రైతులు,పలు ఇబ్బందులు పడుతున్న, ఇంధనం దొరకక లారీలు వాహనాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, దీంతో నిత్యవసరాల ధరలు పెరిగి పేద మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని, పెట్రోల్ బంకు యజమానులు ప్రైవేటు వ్యక్తులకు బ్లాక్ లో అమ్ముకోవడానికి లీటర్ల కొద్ది పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నారని, బ్లాకులో వాహన దారులకు లీటర్ కు 50 నుండి 100 రూపాయల అదనంగా అమ్ముతున్నారని, జిల్లా ఉన్నంత అధికారులు పట్టించుకోవడంలేదని ఆయిల్ కంపెనీలు కేంద్ర ప్రభుత్వం కలిసి ప్రజలపై అధిక భారాలు మోపాలనే కుట్ర జరుగుతుందని ఆయన విమర్శించారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కందుకూరు కోటేష్, మండల కమిటీ సభ్యులు కోమాండ్ల గురువయ్య, మల్లీ కంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, బొడ్డు లింగయ్య, కోమండ్ల ఆంజనేయులు, వింజమూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ యువతికి కృత్రిమ చెయ్యి అందజేత




**కూకట్పల్లి, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఆశ అనే మైనారిటీ యువతి పుట్టుకతోనే కుడి చేయి చిన్నగా ఉండడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తోంది. స్వయంగా కృత్రిమ చెయ్యి ఏర్పాటు చేసుకునే స్థోమత లేక, దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి మేరుగు శివకృష్ణ సమాచారం అందించగా, భారత్ వికాస్ పరిషత్ కేంద్రం ట్రస్ట్ వెంటనే స్పందించి ఆశకు కావలసిన కృత్రిమ కుడి చెయ్యి అమర్చింది. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ, "నాకు కొత్త జీవితం ఇచ్చిన ట్రస్ట్ సభ్యులకు, మేరుగు శివకృష్ణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు" అని భావోద్వేగంగా తెలిపింది. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, మేరుగు శివకృష్ణ, పత్రికేయులు నాగరాజు, జీనుక రఘు, సంధ్య, రఘు, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శం

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**మానకొండూర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 117 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గతంలో ఈ చెక్కుల కోసం ఎక్కువ కాలం వేచి చూడాల్సి వచ్చేదని, ఇప్పుడు నిర్ణీత గడువులోనే అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అదే రోజు రంగపేట గ్రామంలో విత్తన శుద్ధి మిషన్, గోదాంను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్. అన్వేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులు అధిక దిగుబడి కోసం నాణ్యమైన విత్తనాలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. నకిలీ వంగడాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల గతంలో రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి అడ్డుకట్ట వేసిందని గుర్తు చేశారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచీ కృషి చేస్తోందని, విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా అందించే విత్తనాలతో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఆయన అన్నారు. రంగపేటలో ఏర్పాటు చేసిన విత్తన శుద్ధి కేంద్రానికి అవసరమైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

# జనగణన శిక్షణ సదస్సు



**గంగాధర, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలో మే 11 నుండి ప్రారంభమయ్యే జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రామడుగు మండలం వెధిర ప్రాంతంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిక్షణలో జనగణన పరిచయం, భావనలు, నిర్వచనాలు, క్షేత్రస్థాయి పరిశీలన, యాప్ ఇన్‌స్టాలేషన్, గృహాలు--కుటుంబాల వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రామడుగు తహసీల్దార్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో రాజరాజేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎస్ఓ సాయి తేజ, శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు ప్రేమ్‌చంద్రారెడ్డి, ఐలయ్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జనగణన విధులు సమగ్రంగా, బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# సత్యసాయి విద్యావిహార్ సమ్మర్ క్యాంప్‌కు కరీంనగర్ విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్ అంబర్పేట్‌లోని సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో ఏప్రిల్ 28 నుండి మే 3 వరకు సమ్మర్ క్యాంప్ జరుగుతోంది. ఈ క్యాంప్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొనగా, కరీంనగర్ జిల్లా నుండి 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.క్యాంప్‌లో భారతీయ సంస్కృతి--సాంప్రదాయాలపై చర్చలు, సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, యోగ--ధ్యానం, వ్యక్తిత్వ వికాసం, గ్రూప్ డిస్కషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, వీడియో ప్రదర్శనలు, పాటలు--భజనలు వంటి విభిన్న అంశాలపై తరగతులు నిర్వహించబడుతున్నాయి. నిష్ణాతులైన గురువుల ఆధ్వర్యంలో పూర్తిగా ఉచితంగా ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాళ్తేపు లింగమూర్తి, సమితి కన్వీనర్ లక్ష్మణరావు, గణేష్, సౌమ్య యూత్ కోఆర్డినేటర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయానికి రూ.5 లక్షల విరాళం



**వెల్దండ, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ శివాలయం, ఆంజనేయస్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.5 లక్షల చెక్కును అందజేశారు.ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు గోలి గోవర్ధన్ రెడ్డికి చెక్కును అందజేసిన ఆయన, గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో గోలి రాజేందర్ రెడ్డి, గోలి విష్ణువర్ధన్ రెడ్డి, అల్లె సందీప్ గంగపుత్ర, కేశమోని రామచంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి

**-మిషన్ వాత్సల్య పథకం బాలల చట్టాలపై అవగాహన.**

**-డిఎస్పీ శ్రీనివాసరావు**




**దేవరకొండ ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మహిళల హక్కులపై బాల్యవివాహాల నిర్మూలనపై మారకద్రవ్యాలపై సైబర్ క్రైమ్ నేరాలపై మిషన్ వాత్సల్య పథకం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి చేయాలని అదేవిధంగా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ చంద్రకళ, మైనంపల్లి సర్పంచ్ రామ్ సింగ్ నాయక్, బాలల హక్కుల రక్షణ కమిటీ సభ్యులు అంజలి,తేజస్విని, మెడికల్ సూపర్ వైజర్ సఫీయా బేగం, సూపర్వైజర్లు విజయలక్ష్మి, చిట్టెమ్మ, ఎపిఎం విజయలక్ష్మి ,ఏఎన్ఎంలు విజయ,స్వాతి, అంగన్వాడీ టీచర్లు కమలమ్మ,బుజ్జి, లచ్చి, ప్రిన్సిపాల్ హరిప్రియ కళాశాల స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ శివధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మహేష్

**తలకొండపల్లి, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్.



# నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు

**-శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**




**దేవరకొండ ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మున్సిపాలిటీ కో ఆప్షన్ ఎన్నికను పురపాలిక కార్యాలయంలో చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కమీషనర్ పూర్ణ చందర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం మరియు కో ఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో పాల్గొని,నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేవరకొండ మున్సిపాలిటీ నాలుగురు కో ఆప్షన్ సభ్యులను అభినందించి, శు భాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు దేవరకొండ పట్టణ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కౌన్సిల్ సభ్యులకు సలహాలు సూచనలు అందజేయాలని కోరారు.కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచిన నాలుగురు కోఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా విజయం సాధించడంతో తమ పాలకవర్గానికి మరింత బలం చేకూరిందని తెలిపారు.ఈ ఎన్నికల్లో 12 మంది కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులతోపాటు ఆరుగురు బీఆర్ఎస్ సభ్యులు, ఒక్కరు ఇండిపెండెంట్, ఒక్కరు బీజేపీ కూడా మద్దతు తెలుపుతూ చేయి ఎత్తి బలపరచడంతో నాలుగు స్థానాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కైవసం చేసుకుంది.

1. జనరల్ (జనరల్) – గార్లపాటి దామోదర్ s/o శివ లింగం
2. జనరల్ (మహిళా) – నేతాళ్ళ భాగ్యలక్ష్మి భర్త శ్రీనివాసులు
3. మైనారిటీ (జనరల్) – యండి. మైనోద్దిన్ తండ్రి అమిరోద్దిన్
4. మైనారిటీ (మహిళా) – ఏకుల శిపోరమ్మ భర్త సుదర్శన్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని కో ఆప్షన్ సభ్యులను సూచించారు.దేవరకొండ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన సభ్యులందరికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా సేవలో మీ అనుభవం, నిబద్ధత దేవరకొండ పట్టణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు. మున్సిపాలిటీలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛత, పారదర్శక పాలన కోసం మీరు చిత్తశుద్ధితో కృషి చేస్తారని నమ్ముతున్నాను. దేవరకొండ అభివృద్ధి పథంలో మీరు ముందుకు సాగేందుకు నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. మనందరం ఐక్యతతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం.మీ భవిష్యత్ కార్యక్రమాలు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు

**దేవరకొండ ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**






రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరత కారణంగా పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి దేవరకొండ బంకులో పెట్రోల్ డీజిల్ లేదని నో స్టాక్ బోర్డులు అంటించారు ప్రజలు రైతులు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు ఈ పరిస్థితిని తక్షణమే సరి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరినారు. చమరు సంస్థలు కేవలం లాభ ప్రేక్షతోనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని కేంద్రం వాటికి సహకరిస్తూ సామాన్యుడిపై భారాన్ని మోపుతుందని ఆయన ఆరోపించారు ఇంధన కొరత లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పినప్పటికీ రాష్ట్రంలో పెట్రోల్ బంకుల్లో బారులుగా ప్రజలు బాటిల్లు పట్టుకొని నిలిచి ఉండడం బాధాకరమైన విషయం ఇట్టి సమస్యను కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని సామాన్యుడిపై భారాన్ని మోపకుండా అరికట్టాలని ప్రజలకు పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడాలని సూచించారు .ఈ కార్యక్రమంలో పోలేపల్లి మాజీ సర్పంచ్ నాగిళ్ల మహేష్, అంబేద్కర్ యువజన సంఘం చందంపేట మండల అధ్యక్షుడు నాగిళ్ల వెంకటయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో వైభవంగా హోమం, శాత్తుమురై



**ఎలిగేడు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో వెలసియున్న శ్రీ మదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హోమం, శాత్తుమురై కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.ఉదయం ఆరగింపు, బలిహరణం, సాయంత్రం కుంభారాధనలు, నిత్యహవనాలు, తీర్థప్రసాద వినియోగం, సామూహిక కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

# సూపర్ ఏఐ సర్టిఫికెట్ పొందిన దేవరకొండ వాసి

**- పొట్టశిల్ప.**

**దేవరకొండ ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**




హైదరాబాద్ లోని సోమాజిగూడ కత్రియ హోటల్ లో ఈ నెల 26 నజరిగిన కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో విజయాన్ని సాధించారు. ఆమె ఇటీవల ఏఐ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికేట్ పొందారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచంలో ఏఐకి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి ఈ కోర్సును పూర్తి చేశానని తెలిపారు. భవిష్యత్తులో ఈ రంగంలో మరింత ముందుకు వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.ఈసందర్భంగా ఆమెకు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మామ గారు పొట్ట సుగుణయ్య మాజీ కౌన్సిలర్, భర్త పొట్ట ప్రభు యూత్ కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షులు.మరియు స్నేహితులు ఆమెను అభినందించారు.

# బాలికల ఆరోగ్యమే దేశానికి బలం

**- మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్**




**షాద్‌నగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికల అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, కమిషనర్ సునీత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, “10 నుంచి 19 ఏళ్ల వయస్సు బాలికలకు సరైన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత అత్యంత కీలకం. గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్పివి వ్యాక్సిన్ వేయించుకోవాలి. బాల్యవివాహాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను గుర్తించి నిరోధించాలి” అని సూచించారు.మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ మాట్లాడుతూ, “బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. ఆరోగ్యమే దేశానికి బలం” అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎంపీడీవో బన్సీలాల్, డాక్టర్ స్రవంతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాకు అంతరాయం కలగనివ్వం

**- సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాస్**




**వెల్దండ, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని చెర్క్కూర్ గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద మెయిన్ గేటు వాల్ మంగళవారం ఉదయం పాడై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాస్ వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. నూతన గేటు వాల్వ్ తెప్పించి సాయంత్రం లోపే బిగించి గ్రామ ప్రజలకు నీటి సరఫరా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఎండాకాలంలో గ్రామ ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండలు, వార్డు సభ్యుడు పురుగుల లాలయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు గౌరీశంకర్, శశిధర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్--డీజిల్ కొరతపై సిపిఐ నిరసన



**మహబూబాబాద్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకుల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ఆందోళన జరిగింది. పెట్రోల్--డీజిల్‌ను కొరత లేకుండా సరఫరా చేయాలని, కృత్రిమ కొరత సృష్టిస్తున్న కార్పొరేట్ ఆయిల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, "పెట్రోల్--డీజిల్ కొరత వలన రైతులు, 108 అంబులెన్స్ సేవలు, పారిశుద్ధ్య పనులు అన్నీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలి. అత్యవసర సేవలు నిలిచిపోతే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సంక్షోభంపై స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. "ప్రకటనలు మాత్రమే చేసి చేతులు దులుపుకోవడం సరైంది కాదు. వాహనదారులకు వెంటనే పెట్రోల్--డీజిల్ అందుబాటులోకి తేవాలి" అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, మంద శంకర్, తండా శ్రీనాథ్, రాగం మల్లయ్య, మంద శీను, రవి, యాకయ్య, వేణు, తోట రమేష్, నునావత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన కొరత లేకుండా సరఫరా చేయాలి

**- కలెక్టర్ స్నేహ శబరీష్**



**మహబూబాబాద్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా సమస్యలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీ ప్రతినిధులు, పెట్రోల్--డీజిల్ డీలర్లు, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, పౌరసరఫరా శాఖ అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, "జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంధనాలను అందించాలి. ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వేగం పెంచాలి. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు. వ్యవసాయ ఆధారిత వాహనాలు, హార్వెస్టింగ్ యంత్రాలు, ట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని సూచించారు. అలాగే, "పౌరసరఫరా శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, డీలర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలి. పెట్రోల్ బంకుల వద్ద డబ్బాలలో ఇంధనం తీసుకెళ్లరాదు. అవసరం లేకుండా అధిక వినియోగం చేయరాదు. ప్రభుత్వం వేగంగా సరఫరా చర్యలు తీసుకుంటోంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరా శాఖ అధికారి రమేష్, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ప్రణీత్, సౌమ్యదీప్, హరీష్ రాజ్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి పథకాలపై గ్రామసభలో సమీక్ష



**వంగూర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూర్ మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీ భవనంలో గ్రామాభివృద్ధి, మండలాభివృద్ధి పనులపై గ్రామసభ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ వేమారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఎల్.బి. దైవ సహాయం, మండల ఎంపీడీవో బ్రహ్మచారి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, అన్ని శాఖల జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించి, ప్రజల సూచనలు స్వీకరించారు.

# నాగర్‌కర్నూల్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు వాతావరణం అకస్మాత్తుగా మారింది. బలమైన ఈదురు గాలులు, భారీ ఫెక్సీలు చెరిగిపోవడం, పెద్ద శబ్దాలతో గాలులు వీచడం ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. కొన్ని వృక్షాలు నేలకొరిగాయి. అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి రోడ్లపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఏప్రిల్ 30న ఎస్సీ యాక్షన్ ప్లాన్ ఇంటర్వ్యూలు



**వెల్దండ, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలో అమలు జరుగుతున్న ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025--26 పథకాల కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ ధృవీకరణ కార్యక్రమం ఏప్రిల్ 30న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించబడనుంది. మండల ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ, టూ వీలర్, త్రీ వీలర్, సోలార్ యూనిట్లు, పాల జంతువులు తదితర పథకాల కోసం దరఖాస్తు చేసిన అర్హులైన అభ్యర్థులు గురువారం ఉదయం 10:30 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవపత్రం, ఆదాయ ధృవపత్రం, బ్యాంక్ పాస్‌బుక్, దరఖాస్తు కాపీతో పాటు ఇతర సంబంధిత పత్రాలు తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయానికి హాజరై, అవసరమైన పత్రాలు సమర్పించి ఇంటర్వ్యూలలో పాల్గొనాలని ఎంపీడీవో సూచించారు.

# సారాయి స్థావారలపై దాడి



**దేవరకొండ ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పరిధిలో నల్గొండ డిపిఇఓఓ ఆదేశాల మేరకు ఎస్ టి ఎఫ్ హైదరాబాద్ మరియు ఎం.సి. ఎన్ ఎఫ్ టి ఎన్ ఎల్ జి బృందాలతో కలిసి ఆంబోతు తండా, మేఘ్య తండా , ఫన్నీ తండ గ్రామాలలో దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను రెస్ట్ చేసి, వారి నుండి పది లీటర్ల సారాయి స్వాధీనం చేసుకొని, 600లీటర్ల ఎఫ్ జి వాష్ ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎచ్ ఓ , బృందం పాల్గొన్నారు.

# మత్తు వదలరా..



మత్తు....
నీ ఉల్లంలో
ఉల్లాసం నింపే
తాత్కాలిక గమ్మత్తు
కానీ...
నువు కోల్పోతావు యావత్తు
భగ్నమైపోతుంది
నీ భవిష్యత్తు
మెడికోలను సైతం
సైకోలుగా
హీరోలను జీరోలుగా
మిత్రులను
శత్రువులుగా
కళాకారులను
కళావిహీనులుగా
మార్చేస్తుంది.
ఈ మత్తు వల్ల....
ఇనుప కండరాలు
తుప్పుపట్టి తప్పుదారి వైపు
తప్పటడుగులు వేస్తున్నాయి
ఉక్కు నరాలు బక్క చిక్కి
బిక్క చచ్చిపోతున్నాయి
వజ్ర కఠోర మనస్సు
తమస్సులో పడి
ఉషస్సు కోల్పోయి
ఉస్సూరుమంటుంది
ఈ అవివేకులకు
వివేకానందుని
ఆశలు, ఆశయాలు
అర్థమయ్యేదెప్పుడో...
భారత యువతకు
భ్రమలు తొలిగేదెన్నడో...

( మత్తు పదార్థాలకు బానిసై, బంగారు భవిష్యత్తు నాశనం చేసుకునే వారి కొరకు మాత్రమే )

**Ch. శ్రీనివాస్**
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం... ఎలిగేడు



# గంగాధర ప్రీమియర్ లీగ్ విజేత ఠాగూర్ కింగ్స్




**గంగాధర, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలో ఎడ్ల అనిల్ అనూష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గంగాధర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పోటీపడ్డాయి. పది రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఠాగూర్ కింగ్స్ విజేతగా నిలిచి రూ. 30,000 నగదు బహుమతి అందుకుంది. రెండో స్థానంలో ఏకేఎం టీమ్ రూ. 20,000, మూడో స్థానంలో విక్రమ్ వైల్డ్ వైర్స్ రూ. 5,000, నాలుగో స్థానంలో శ్రీహరి సోల్జర్స్ రూ. 5,000 నగదు బహుమతులు పొందాయి. బహుమతులను మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్, ఉపసర్పంచ్ రాజు, వార్డ్ సభ్యులు గుంటి సంజీవ్, పెంచల చందు, ప్రభాకర్, పొన్నాల శ్రీనివాస్, లవన్ కుమార్, శ్రీహరి, బాచి ప్రవీణ్, సంతు, విజయ్ అందజేశారు.

# ఆడపిల్లలకు చదువే ఆయుధం

- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్
- సీడీపీఓ శాంతి రేఖ





**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆడ పిల్లలకు చదువే ఒక ఆయుధమని, అమ్మాయిల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమనగల్లు మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, సీడీపీఓ శాంతి రేఖ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో నిర్వహించిన పోషణ పక్వాడీ కార్యక్రమంలో చైర్మన్ పత్యనాయక్, సీడీపీఓ శాంతి రేఖ, కమిషనర్ శంకర్ నాయక్ లు పాల్గొని మాట్లాడారు. బాలికల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ – 1098, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రాధిక మరియు వైద్య సిబ్బంది, ఆర్ పీ లు, అంగన్వాడీ టీచర్లు కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# బాలికల భద్రతకు కృషి చేయాలి

– సర్పంచ్ మహేందర్ గౌడ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బాలికల భద్రతకు సమాజంలోని ప్రతీ ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో చైల్డ్ సేఫ్టీ వీక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ మహేందర్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు చదువే ఒక ఆయుధమని, అమ్మాయిల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాలికల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ – 1098, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బలవంత్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మొహమ్మద్ పాషా, మరియు వాట్స్ సభ్యులు ఆశ అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీకి ఆసిఫ్ ఆలీ శుభాకాంక్షలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ ఆలీ మంగళవారం మీర్ఖాన్ పెట్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఎఫ్.సి.డీ.ఏ నూతన సిటీ కమిషనరేట్ భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన డీజీపీ శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మోడీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- స్వతంత్ర దేవ్ సింగ్
-ఉత్తరప్రదేశ్ జలశక్తి శాఖ మంత్రి



**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తరప్రదేశ్ జలశక్తి శాఖ మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ సూచించారు. మంగళవారం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం దర్శనం అనంతరం తిరుగూ ప్రయాణంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఘన స్వాగతం పలికారు. పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో 56 ఏండ్లలో జరగని అభివృద్ధి.. ప్రధాని మోడీ పాలనలో జరిగిందని చెప్పారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచంలోనే అగ్రగామిలో ఉంచారని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బీజేపీ సోషల్ మీడియా కార్యకర్తలు వాట్సప్, ఫేస్బుక్, ఇన్ స్ట్రాగ్రామ్ల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర సంక్షేమ పథకాలతో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ పోస్టులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, నిరంజన్, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్ కెకె, నాయకులు గోరటి నర్సింహా, చెక్కల లక్ష్మణ్, రాంపాల్ నాయక్, దుర్గయ్య, చెన్నకేశవులు, శ్రీకాంత్ సింగ్, కో ఆప్షన్ సభ్యుడు అల్లాజీ గౌడ్, కండె భాస్కర్, రవి రాథోడ్, కృష్ణ నాయక్, చంద్రయ్య, విజయ్ కృష్ణ, నందు, సాయి, ఆనంద్, శ్రీనివాస్, శివ తదితరులు ఉన్నారు.

# మే.. 9న కడ్తాల్ బీసీ సంక్షేమ సంఘ ఎన్నికలు

- యువజన, సంక్షేమ సంఘాలకు వేర్వేరు ఎన్నికలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల కోసం సన్నాహాలు జోరుగా కొనసాగుతున్నాయి. మే 09న శనివారం ఎంబీఏ గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశంలో సంఘానికి కొత్త అధ్యక్షుడు, కార్యవర్గాన్ని ఎన్నిక చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్ ప్రకటించారు. మంగళవారం కడ్తాల్‌లో బీసీ సంఘం ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యువజన సంఘం, బీసీ సంక్షేమ సంఘానికి విడివిడిగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాస్వామ్య విధానంలో జరుగుతుందని తెలిపారు. గత పదేళ్ల కాలంలో బీసీల హక్కుల సాధన కోసం పలు ఉద్యమాలు చేపట్టామని పిప్పల్ల వెంకటేష్ పేర్కొన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగిన ఉద్యమాల్లో బీసీ నాయకులతో కలిసి చురుకుగా పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు వివరించారు. కడ్తాల్ పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘానికి ప్రత్యేక భవనం నిర్మాణం కోసం అప్పటి గ్రామపంచాయతీ పాలక మండలి మద్దతుతో సుమారు 3000 గజాల స్థలం కేటాయించడాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ భవనం నిర్మాణం ద్వారా బీసీ సమాజానికి మరింత సేవలు అందించే దిశగా ముందడుగు పడిందన్నారు. అదేవిధంగా కడ్తాల్ బస్టాండ్ సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంఘం చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమని పేర్కొన్నారు. పూలే ఆశయాలను ప్రేరణగా తీసుకుని బీసీ సమాజ అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీసీ సంఘ సభ్యులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ద్వారా కొత్త నాయకత్వం వెలుగులోకి వచ్చి బీసీ సంక్షేమానికి మరింత ఊతమివ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు కేశని మహేష్, ప్రధాన కార్యదర్శి మూడ రవి నాయకులు కందికంటి సుధాకర్ గౌడ్, సత్యం యాదవ్, మాలే మల్లేష్ గౌడ్, దేవేందర్ గౌడ్, మహేశ్వర్, మిర్యాణం సంతోష్ కుమార్, దోనాదుల మహేష్, క్యామ రాజేష్, భానుకిరణ్, డైరెక్టర్ చందు, చెన్నమోని కృష్ణ, బోసు రవి, చిప్ప రాజు, జగన్ యాదవ్, కేశని శంకర్, తరుణ్, సన్నీ, మాదారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- లయన్స్ జిల్లా గవర్నర్




**యాచారం, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్టార్స్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నియో పోలీస్ సంయుక్తంగా యాచారం గ్రామంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఒక సేవా సంస్థ అని, వారు అందించే వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో ప్రధాన ఆకర్షణగా యశోదా హాస్పిటల్స్‌కు చెందిన వైద్యుల ప్రత్యేక బృందం పాల్గొని, వంద మందికి పైగా వ్యక్తులకు ఉచితంగా పూర్తి కార్డియాక్ పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా ఈ పరీక్షలకు బయట రూ.1500 నుండి రూ.2000 వరకు ఖర్చవుతుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ స్టార్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఆర్. అశోక్ కుమార్ రెడ్డి ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించగా, మొత్తం కార్యక్రమాన్ని రీజన్--5, జోన్--1కి చెందిన జడ్‌సి లయన్ పి. సంజీవ్ రెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమానికి ఆర్‌సి సర్దార్ సంతోక్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ లయన్ పి. తిరుపతి రెడ్డి, చందర్ బుడగ, తాటి శ్రీనివాస్, శంకర్ గాజుల, జి.ఎస్. రెడ్డి తదితరులు హాజరయ్యారు. అలాగే జిల్లా స్థాయి నాయకులు లయన్ నరేందర్ రెడ్డి, పీఎంసీసీ ఏరియా లీడర్, పీడీజీ లయన్ చెన్నా కిషన్ రెడ్డి, డీజీ ఎలెక్ట్ సురేష్ జిగ్నాని, ఎస్.వి.డీ.జీ ఎలెక్ట్ పి.ఆర్.కె. నాగరాజు, క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో సుమారు 350 మందికి పైగా ప్రజలు వివిధ ఆరోగ్య సేవలను పొందారు. అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్సలు, మందులు అందజేయడం జరిగింది. జోన్ చైర్మన్ జె. లింగయ్య, డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ హైదరాబాద్ స్టార్స్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ రెడ్డి, నియో పోలీస్ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి, జె. రమేష్, పి. వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, పవన్, శ్రీకాంత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ చంద్రకాంత్, సురేష్ రెడ్డి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# ఘనంగా హిందూ సమ్మేళనం




**తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రేణుకుంట ఉప మండల కేంద్రంలో శ్రీ అభయాంజనేయ స్వామి సహిత జిటేశ్వర కాశి విశ్వనాథ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ ప్రచార ప్రముక్ తరిగొప్పుల శంకరయ్య మాట్లాడుతూ హిందువుల ఐక్యత జాతీయ సమైక్యతకు, దేశ రక్షణకు పునాదిలాంటిదని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు హిందూ ఐక్యత అత్యవసరమని, కుల--ప్రాంతీయ విభేదాలను పక్కన పెట్టి హిందువులందరూ ఒకే కుటుంబంగా భావించాలని పిలుపునిచ్చారు. సంఘం స్థాపనకు వందేళ్ళు పూర్తయ్యాయని, ఈ కాలంలో దేశహితం, మాతృభూమి సేవ, సంస్కృతి పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసిందని గుర్తు చేశారు. మహిళా వక్త లెక్కల రమాదేవి, విష్ణు సేవనంద స్వామిజీ మాట్లాడుతూ సనాతన ధర్మం సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు హిందూ ఐక్యత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవా రాజు, సమితి బాధ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి

## -జడ్జి కాటం స్వరూప



**ఆమనగల్లు, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఆమనగల్ జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆమెను ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ సమక్షంలో మంగళవారం గజమాల, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి కాటం స్వరూప మాట్లాడుతూ.. ఆమనగల్లు న్యాయవాదులతో ఉన్న అనుబంధం మర్చిపోలేనిది అన్నారు. ఎక్కడ పనిచేసినా సత్వర న్యాయం అందేందుకు కృషి చేస్తానన్నారు. మానవతా దక్పదం ఉన్నచోట న్యాయం, ధర్మం నిలబడుతుందన్నారు. అధికారులు, న్యాయవాదులు అందించిన సహకారం ప్రశంసనీయమన్నారు. న్యాయవాదులు అందించిన సహకారంతోనే ఇక్కడ సుదీర్ఘకాలం పని చేయగలిగానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్ సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, శ్రీనివాస్, కృష్ణయ్య, జానకి రాములు, సుధాకర్ రెడ్డి, దుడ్డు ఆంజనేయులు, మల్లేష్ గౌడ్, భాస్కర్ రెడ్డి, మల్లేష్ సూపరిండెంట్ మురళీధర్, న్యాయవాదులు రామకృష్ణ. మల్లేష్, జగన్ గౌడ్, మధు గౌడ్, కొప్పు కృష్ణ, మల్లేష్, శేఖర్, ఆంజనేయులు, శిరీష్, ప్రభు నాయక్, శ్రీశైలం, మహేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, శిరీష, శైలజ, ప్రియాంక మరియు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చెయ్యాలి

## - మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా, మండల అధికారులు పాల్గొన్న సమీక్షా సమావేశంలో మంత్రి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైతులకు మద్దతు ధరతో పాటు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, తాగునీటి సమస్యలు నివారించేందుకు పైపులైన్ పనులు, ట్యాంక్ మరమ్మత్తులు, లీకేజీలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేస్తామని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం కావడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, డీఆర్డీవో శ్రీధర్, డీఎస్ఓ నర్సింగరావు, సివిల్ సప్లై డీఎం రజనీకాంత్, డిపిఓ జగదీశ్వర్, హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచన



**హుస్నాబాద్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలో విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పిల్లలను బావులు, చెరువుల్లో ఈతకు పంపకూడదని, అవసరమైతే పెద్దలు స్వయంగా తోడుగా వెళ్లి నేర్పించాలని అన్నారు. మోటార్ సైకిల్ నడపమని తాళాలు ఇవ్వకూడదని, ఎక్కువసేపు మొబైల్, ట్యాబ్లెట్ వాడనివ్వకూడదని, స్నేహితులతో దూరప్రాంతాలకు పంపకుండా ఇంట్లో పెద్దలతో సమయం గడిపేలా చూడాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ఆరుబయట ఆడుకోవడం నివారించాలని, వేసవిలో అధిక ఎండ కారణంగా డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యం, ఆహారంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి సృజనాత్మకతను పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధిస్తున్న విద్యార్థులకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ విద్యా విధానాలపై డీటీఎఫ్ సదస్సు




**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉమ్మడి కరీంనగర్ జిల్లా డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కరీంనగర్‌లోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ విద్యా రంగం -- వర్తమానం, భవిష్యత్తు, సవాళ్లు అనే అంశంపై విద్యా సదస్సు జరిగింది. సదస్సులో ప్రధాన వక్తగా వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం, ఉపాధ్యాయ నియామకాలను విస్మరించడం వల్ల విద్య పేదలకు అందని ద్రాక్షగా మారుతోందని విమర్శించారు. కొత్తగా పబ్లిక్ స్కూల్లు స్థాపిస్తామని చెబుతున్నా, వాటికి కూడా తగిన నిధులు కేటాయించకపోవడం కేవలం మాటలకే పరిమితమని ఆయన అన్నారు. విద్యను బలహీనపరచి ప్రజలను చైతన్యహీనులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని వ్యాఖ్యానించారు. డీటీఎఫ్ అకాడెమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి. రామకృష్ణ మాట్లాడుతూ ఆకునూరి మురళి కమిషన్ నివేదికలో ఉపాధ్యాయులను కించపరిచే అంశాలు చేర్చబడ్డాయని, నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయాలనే ఉద్దేశ్యం దాగి ఉందని తెలిపారు. సదస్సులో తెలంగాణ విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ అవకాశాలు, ప్రభుత్వ విధానాల ప్రభావంపై విస్తృత చర్చ జరిగింది. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన వైద్యుల రాజిరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, అధ్యాపక జ్వాల సంపాదకుడు డాక్టర్ ఎం. గంగాధర్, రాష్ట్ర కార్యదర్శులు, పూర్వ అధ్యక్షులు, జిల్లా కమిటీలు, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో బాలికలకు స్నేహ గ్రూప్ అవగాహన సదస్సు



**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యుక్త వయస్సు బాలికల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికలు ఎదుర్కొనే సవాళ్లు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. సదస్సులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, ఆర్డీవో మహేశ్వర్, కార్యనిర్మాత సవిత, సీఐ చింతల పుల్లయ్య, సీఐ శ్రీలత పాల్గొన్నారు. బాల్య వివాహాల దుష్పరిణామాలను ప్రస్తావిస్తూ డిప్యూటీ మేయర్ సునీల్ రావు చిన్న వయసులో పెళ్లిళ్లు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తాయని హెచ్చరించారు. మహిళలు స్వయం ఆధారంగా ఎదిగి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, చట్టరీత్యా బాల్య వివాహాలు నేరమని, అలాంటి ఘటనలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కౌమార దశలో తలెత్తే శారీరక, మానసిక మార్పులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుండి వచ్చిన మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన బీజేపీ శిక్షణ శిబిరాలు



**హుస్నాబాద్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొత్తకొండ గ్రామంలో బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 పేరిట రెండు రోజుల బీజేపీ నియోజకవర్గ స్థాయి శిక్షణ శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వందేమాతరం గీతాలాపనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను బూత్ స్థాయిలో ప్రతి ఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరో సెషన్‌లో కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, గ్రామస్థాయిలో విస్తరణపై వివరించారు. రెండో రోజు రాష్ట్ర స్థాయి వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించగా రావు అమరేందర్ రెడ్డి, ముగ జయశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయి నాయకులు, మండలాధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. మొదటి రోజు శిక్షణ తరగతులు జాతీయ గీతంతో ముగిశాయి.

# మహిళా డిగ్రీ కళాశాలలో అకాడెమిక్ కౌన్సిల్ సమావేశం

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, కరీంనగర్‌లో అకాడెమిక్ కౌన్సిల్ సమావేశం విజయవంతంగా జరిగింది. శాతవాహన విశ్వవిద్యాలయం నామినీలు ప్రొఫెసర్ ఎస్. సుజాత, డా. వి. నమ్రత, గవర్నింగ్ బాడీ సభ్యులు ఎం. సంతోష్ రెడ్డి, ప్రొఫెసర్ రామకృష్ణ రాపర్ల పాల్గొన్నారు. సమావేశంలో పాఠ్య ప్రణాళిక అభివృద్ధి, నూతన బోధన పద్ధతులు, మూల్యాంకన విధానాల్లో సంస్కరణలు, విద్యార్థుల ప్రదర్శన మెరుగుదలపై చర్చ జరిగింది. ఆధునిక విద్యా ప్రమాణాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా చర్యలు సూచించబడ్డాయి. మహిళా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు మరిన్ని సర్టిఫికేట్ కోర్సులు ప్రవేశపెట్టాలని నామినీలు సూచించారు. ప్రిన్సిపాల్ డా. డి. వరలక్ష్మి సభ్యుల సూచనలకు కృతజ్ఞతలు తెలుపుతూ, స్వయం ప్రతిపత్తి విద్యా ప్రమాణాలను బలోపేతం చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డా. అఫ్సారీ ఉస్మాని, పరీక్షల నియంత్రణ అధికారి డా. జి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు నియంత్రణ అధికారి డా. బి. రజనీ దేవి, అకాడెమిక్ సమన్వయకర్తలు డా. సి. హెచ్. విద్య, డా. ఎన్. మనోజ్ కుమార్, వివిధ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

# ఒక్క రూపాయి అంత్యక్రియల పథకంపై వివాదం

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పేదవాడి ఆఖరి ప్రయాణానికి అండగా నిలిచిన ఆఖరి సఫర్ ఒక్క రూపాయి అంత్యక్రియల పథకం ఇప్పుడు వివాదాస్పదమైంది. మానవత్వంతో ప్రారంభమైన ఈ పథకాన్ని అధికారులు నిబంధనల పేరుతో సామాన్యులకు దూరం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి ఘటనలు ఈ అనుమానాలను మరింత బలపరిచాయి. 35వ డివిజన్‌లో నివసిస్తున్న వరంగల్ వ్యక్తి మృతి చెందగా స్థానిక ఆధార్ లేదని అధికారులు నిరాకరించడంతో ఆగ్రహించిన కార్పొరేటర్ భర్త గుగ్గిళ్ల రమేష్ మున్సిపల్ కార్యాలయంలో ఆవేశంగా ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమంలో వృద్ధుడు



మరణించిన సందర్భంలో గుర్తింపు కార్డుల పేరుతో అంత్యక్రియలు అడ్డంకులు ఎదుర్కొన్నాయి. కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్ జోక్యం చేసుకోవడంతో చివరికి అంత్యక్రియలు పూర్తయ్యాయి. స్థానిక ఆధార్ కార్డు లేని వలస కార్మికులు, అద్దె ఇళ్లలో నివసించే వారు, అనాథాశ్రమాల్లో ఉన్న వృద్ధులు ఈ పథకం ప్రయోజనం పొందడం కష్టమవుతోంది. సేవా సంస్థలు ఎన్నో వ్యయప్రయాసలతో అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్నా, నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం అప్పటి మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రారంభించిన ఈ పథకం దేశవ్యాప్త ప్రశంసలు పొందింది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా మెచ్చుకున్న ఈ మానవీయ పథకాన్ని ఆంక్షలతో నీరుగార్చకూడదని, స్థానిక--స్థానికేతర భేదం లేకుండా ప్రతి పేదవాడికి వర్తించేలా మున్సిపల్ పాలకవర్గం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థలకు కొత్త అనుమతులు ఇవ్వొద్దని ఆర్‌పిఐ డిమాండ్

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇకపై పర్మిషన్లు ఇవ్వకూడదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ మాట్లాడుతూ, ఇప్పటికే అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై విచారణ జరిపి,




యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకే అనుమతితో అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. త్వరలో హైకోర్టులో స్టే అడుగుతామని, పర్మిషన్ లేని సంస్థలపై సిట్టింగ్ జడ్జి విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రైవేట్ విద్యాసంస్థలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా హైకోర్టులో స్టే తీసుకురావడానికి ప్రయత్నిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ యజమానికి అందజేత

**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ రజ్వి చమన్‌కు చెందిన డాక్టర్ మొహమ్మద్ నుమానుద్దీన్ తన వన్‌ప్లస్ సెల్‌ఫోన్‌ను బొమ్మకల్ గ్రామంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఆయన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను




ట్రేస్ చేసి హౌసింగ్ బోర్డ్ కాలనీలో గుర్తించారు. అనంతరం ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి స్వయంగా డాక్టర్ నుమానుద్దీన్‌కు ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీమ్ సభ్యులు కానిస్టేబుల్ చిట్యాల రామ్ సాయి, మహిళా కానిస్టేబుల్ పద్మజలను సీఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు. ఈ చర్యతో పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## వెలిచాల రాజేందర్‌రావుకు పూర్తి బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ నేతల వినతి

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్‌రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్



పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులు, సర్పంచులు, ముఖ్య నేతలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం డిసిసి కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నేతలు మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి రాజేందర్‌రావుకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లగల సామర్థ్యం ఆయనకు ఉందని పేర్కొన్నారు. ఈ వినతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అధిష్టానం పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల నందిని ఉదయ్, గుమ్మడి రాజకుమార్, కాంతాల జగన్ రెడ్డి, భాస్కర్ నాయక్, గంట శ్రీనివాస్, కల్లేపల్లి శారద, బాలరాజు, పడాల శ్రీజ, అజయ్, పడిశెట్టి వసంతలక్ష్మి, భూమయ్య, పర్వతాల మల్లేశం, వరాల నరసింగం, ఇక్రమ్ సికిందర్, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, కంటెస్టెంట్ అభ్యర్థులు, సర్పంచులు, మైనార్టీ నాయకులు, జిల్లా నాయకులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ నూతన కమిటీ

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని ఉజ్వల పార్క్ యాదవ భవన్‌లో జిల్లా కోర్ కమిటీ సమావేశం జరిగింది. కుల బంధువుల అభిప్రాయంతో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా



ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మంచాల రవీందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల మల్లేశం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సందబోయిన ప్రసాద్ యాదవ్, ఉపాధ్యక్షులుగా గాలి రవి యాదవ్, తమ్మనవేని నరసయ్య యాదవ్, నల్లంగి కొమురయ్య యాదవ్, మండల సాయిబాబా యాదవ్, జిల్లా కార్యదర్శిగా వేల్పుల కొమురయ్య, ముఖ్య సలహాదారుగా బాయిని పోచమల్లు యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మంచాల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కోర్ కమిటీ సభ్యులకు, యాదవ కుల బాంధవులకు జీవితకాలం రుణపడి ఉంటానని, యాదవ సమస్యలపై హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

# మే 5 నిరాహార దీక్ష విజయవంతం చేయాలని జేఏసీ పిలుపు

**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో మే 5న జరగనున్న ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి ఉద్యోగి పెద్ద ఎత్తున పాల్గొనాలని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఈరోజు జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి చేరవేసి సమర్థవంతంగా అమలు చేసే వారు ఉద్యోగులేనని, అలాంటి ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. నాయకులు మాట్లాడుతూ, డిఏలు, ఇంక్రిమెంట్లు, పీఆర్సీ అమలు, జిపిఎఫ్, సరెండర్ లీవ్ బిల్లులు, టీజీఎల్ఐఎఫ్ ఇన్సూరెన్స్ బిల్లులు,



ఏరియర్స్ వంటి అంశాలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపిఎస్ పునరుద్ధరణ, సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డు పథకం, కాంట్రాక్ట్--ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ఒకే స్వరంతో నిరసన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, జిల్లా ఇన్చార్జి కటకం రమేష్, పేండ్యాల కేశవ రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు తిరుపతిరావు, జయపాల్ రెడ్డి, సుంకిశాల ప్రభాకర్ రావు, చింతపల్లి అశోక్, జైపాల్ రెడ్డి, కోట రామస్వామి, శంకర్, జాలి మహేందర్ రెడ్డి, జకోజి వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, డాక్టర్ అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, శారద, సునీత, సరిత, సబిత, సుస్మిత, శైలజ, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్, మారుపాక రాజేష్, భరద్వాజ్, పోలు కిషన్, వెలిచాల సుమంతరావు, రోహిత్ వెంకట్ రెడ్డి, తాళ్ళపెల్లి రాంమోహన్, బోనాల రవి, వంశీ, రమేష్, లవ్ కుమార్, కరుణాకర్, జీనన్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## జనగణన సెల్ఫ్ ఎన్రోల్మెంట్ పూర్తి చేసిన యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు మంగళవారం తన కార్యాలయంలో జనగణన సెల్ఫ్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ వేణు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తేజస్విని కలిసి ఆన్‌లైన్ ద్వారా ఆయన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ దేశాభివృద్ధికి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు జనగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అధికారులకు సహకరిస్తూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## వికలాంగులకు స్కూటీల పంపిణీ



**శంకరపట్నం, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శంకరపట్నం మండలానికి చెందిన ఇద్దరు వికలాంగులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మూడు చక్రాల స్కూటీలను అందజేశారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్లో తాడికల్ గ్రామానికి చెందిన వెంగల రాజయ్య, లింగాపూర్ గ్రామానికి చెందిన బుచ్చటి రమేశ్ లకు ఈ వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య, పార్టీ నాయకులు తడిసిన నారాయణరెడ్డి, ఊకంటి మధుకర్, కాల్వ పద్మ, జనగామ రాజయ్య, నర్సిరెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, బుధారపు శ్రీనివాస్, చింతల లక్ష్మారెడ్డి, పెరుక రవీందర్, పోతుగంటి శ్రీనివాస్, తమ్మిశెట్టి రాజేష్, సయ్యద్ రజాక్ తదితరులు పాల్గొన్నారు. వికలాంగుల స్వయం ఆధార జీవనానికి తోడ్పడే ఈ పంపిణీ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు పొందింది.

## ఇసుక మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానేరువాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నగునూరు గ్రామానికి చెందిన వల్లేపు వెంకటేష్, సంకరి శ్రీనివాస్‌లను పోలీసులు ఇరుకుల్ల గ్రామ బస్‌స్టాప్ వద్ద పట్టుకుని ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇంతకుముందు బైండోవర్ అయినప్పటికీ మళ్లీ అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నగునూరు గ్రామానికి చెందిన బండారి సంపత్, బొమ్మకల్ గ్రామానికి చెందిన కుమ్మరి రాకేష్, గన్ను రాకేష్‌లను ఎమ్మార్వో ముందు హాజరుపరచగా వారికి జరిమానా లేదా జైలు శిక్ష విధించారు. పలుమార్లు అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన బండారి సంపత్, ఓల్లేపు అజయ్, బాతుల వీరయ్య, గన్ను రాకేష్, కుమ్మరి రాకేష్‌లపై సస్పెక్ట్ షీట్లు తెరవడం జరిగింది. ఇకపై చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.